క్లుప్తంగా

ఈత సరదాతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

ఒంగోలు టౌన్: ఈత సరదాతో ప్రాణాల మీదకు తెచ్చుకోని తల్లిదండ్రులకు తీరని శోకం మిగల్చవద్దని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులు, వాగులు, వంకలు, కుంటలు, కాలువలు పూర్తిగా నిండిపోయాయని తెలిపారు. ఈత రాకపోయినా కొందరు పిల్లలు స్నేహితుల ఒత్తిడితో నీటిలోకి దిగుతారని, ఇది మరింత ప్రమాదకరమని పేర్కొన్నారు. నీటి ప్రవాహం తక్కువగా వున్న ప్రదేశాల్లో మాత్రమే ఈతకు దిగాలని సూచించారు.

తగినంత మోతాదులోనే ఎరువులు వాడాలి



తెగుళ్లపై నిమ్మ రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): నిమ్మతోటలో తగినంత మోతాదులో సమపాళ్లలో ఎరువులు వాడాలని, మోతాదుకు మించి ఎరువులు వాడకూడదని డాక్టర్ వెంకటేశ్వరెడ్డి సూచించారు. గురువారం గుడిపాడు గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిమ్మతోటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శిలీంద్రాల వలన వేరుకుళ్లు తెగుశల్ వస్తాయని, వాటికి నివారణ పద్ధతులు పాటించాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారిణి సంధ్య, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చీమకుర్తి: శాసన సభ, శాసన మండలిలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందటంతో ఎంఆర్‌పీఎస్ నాయకులు గురువారం చీమకుర్తిలో కేకు కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణ ఫలితాలు అందుకున్న వారికి అభినందనలు తెలిపారు. వర్గీకరణ బిల్లు ఆమోదం పొందేందుకు సహకరించిన కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంతా ఏసుదాస్, జన్నాజుపల్లి యాకోబు, బుట్టి సాల్మన్, నాగరాజు, కోటయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలి



ప్రసంగిస్తున్న సూపరిండెంటెంట్ మాణిక్యరావు

ఒంగోలు టౌన్: డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేయడంలో వైద్య సిబ్బంది నిష్ణాతులు కావాలని జీజీహెచ్ సూపరిండెంటెంట్ డాక్టర్ మాణిక్యరావు సూచించారు. ఆయుష్మాన్ భారత్, ఏబీడీఎం హెల్త్ రికార్డ్, ఈ హాస్పిటల్‌లో భాగంగా వైద్యులకు, సిబ్బంది నిర్వహించిన శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలని చెప్పారు. ఇందులో రోగి ఎక్కడైనా సరే వైద్య సేవలను పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ అద్దయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం డిజిటల్ హెల్త్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వైద్య సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ మాధవి లత, డిప్యూటీ సూపరెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, తిరుపతి రెడ్డి, చెంచయ్య, ప్రభాకర్‌రావు, గోపికృష్ణ, సంధ్య, రోల్‌బెట్ మేనేజర్ సాయి పాల్గొన్నారు.

ట్రంప్ ఆంక్షలపై నోరెత్తని మోదీ



నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: హెచ్‌బీ1 వీసా కోసం లక్ష డాలర్లు చెల్లించాలనడం దుర్మార్గమని.. అడ్డగోలుగా ట్రంప్ విధిస్తున్న ఆంక్షలపై మోదీ నోరు విప్పి మాట్లాడకపోవడం సిగ్గుచేటని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎఫ్ బాబు విమర్శించారు. అమెరికా ఆంక్షలపై భారత విద్యార్థి సమాఖ్య, ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వరంలో రంగరాయుడు చెరువు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల చేతికి, కాళ్లకు సంకెళ్లు వేసి పంపిస్తే మోదీ ప్రభుత్వం మాట్లాడకుండా దేశ ప్రతిష్టను దిగజార్చిందని మండిపడ్డారు. ఆంక్షల వలన మెరుగైన ఉపాధి అవకాశాలు కోరుకునే యువత భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందన్నారు.

సింహ వాహనంపై కాత్యాయని దర్శనం



లాయర్ పేట షిర్డిసాయిబాబా మందిరంలో చందన నెమలి అలంకరణలో రాజరాజేశ్వరిదేవి




చీమకుర్తి సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గాభవానీ అలంకారంలో..




చీమకుర్తి హరిహరక్షేత్రంలో కాత్యాయినీదేవి అలంకారంలో అమ్మవారు



ఒంగోలులో లలితా త్రిపురసుందరీదేవిగా వాసవీ అమ్మవారు



ఒంగోలు కేశవస్వామిపేటలో అలంకరణలో విజయదుర్గాదేవి



గంటాపాలెంలో కామాక్షిదేవి అలంకరణలో అమ్మవారు



కొత్తపట్నం బస్టాండ్ తూర్పుపాలెం శివాలయంలో భువనేశ్వరి దేవి అలంకరణలో రాజరాజేశ్వర స్వామి

- ఉత్సాహంగా దసరా శరన్నవరాత్రులు
- ప్రత్యేక పూజలు చేసిన మహిళలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు మెట్రో: ఒక చేతిలో ఖడ్గం.. మరో చేతిలో పద్మాన్ని ధరించి సింహ వాహనంపై ఆశీనురాలై భక్తులకు జ్ఞానాన్ని, ఆపదలను దూరం చేసే స్వరూపం కాత్యాయనిదేవి. జ్ఞాన చక్రానికి అధిష్టాన దేవతైన కాత్యాయని అమ్మవారిని పూజిస్తే వివాహ సమస్యలు, మాంగల్య దోషాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఒంగోలు నగరంలో అమ్మవారి ఆలయాలు వివిధ రంగుల పూల అలంకరణతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. నవరాత్రుల సందర్భంగా ఆలయాలలో భక్తుల తాకిడి పెరిగింది. మహిషాసుర రాక్షసుడిని వధించడానికి కనకదుర్గమ్మ అమ్మవారు వివిధ రూపాలలో అవతరించింది. వివిధ రూపాలలో అవతరించిన అమ్మవారి దర్శనం కోసం ఉదయం నుంచి భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. నాలుగో అవతారంలో ఉన్న కనకదుర్గమ దర్శనం పూజించడం వల్ల వివాహంలో అడ్డంకులు తొలిగి, వారి వైవాహిక జీవితం ఆనందంగా ఉంటుందని భక్తులు నమ్ముతారు. నగరంలోని అమ్మవారి ఆలయాలలో కాత్యాయని అమ్మవారు ఎరుపు రంగు వస్త్రాలతో సింహం వాహనంపై పూజలందుకొని బెల్లం అన్నం, అన్నం ముద్ద పప్పు, రవ్వ కేసరి, నైవేద్యంగా స్వీకరించారు. సాయంత్రం ప్రముఖ ఆలయాలలో సంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆలయ నిర్వాహకులు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.



అష్టలక్ష్మి వేషధారణలో మహిళలు



మంగమూరు రోడ్డు మర్రిచెట్ల కాలనీలో భక్త ప్రహ్లాద నాటకంలో సన్నివేశంలో చిన్నారులు

భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు

చీమకుర్తి: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం చీమకుర్తి హరిహరక్షేత్రంలో కాత్యాయినీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శిద్దా లక్ష్మీపద్మావతి సమర్పించిన 108 పట్టు చీరలతో అమ్మవారిని వైభవంగా అలంకరించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదాలు స్వీకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ నిర్వాహకులు అందించారు. చీమకుర్తి ఇసుకవాగు వద్ద ఉన్న సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ఆలయ అర్చకులు కనకదుర్గ భవానీగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

చంద్రబాబు చరిత్ర అంతా మోసం

- ఇంత వరకు కొత్త పింఛన్లు లేవు
- బాబు ష్యూరిటీ మోసం–గ్యారెంటీలో చుండూరి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు, నాయకులు

కొత్తపట్నం: చంద్రబాబు చరిత్ర అంతా మోసమని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు విమర్శించారు. గురువారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం మడనూరు గ్రామంలోని స్వర్ణాంధ్రపాలెం, చిన్నపాలెం, పెద్దపాలెంలలో నిర్వహించారు. కార్యక్రమానికి రవిబాబు, మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ.. ప్రజలను మభ్యపెట్టి పథకాలు ఇస్తామని.. పత్రాల మీద సంతకాలు పెట్టి ఇంటింటి ప్రచారం చేసి ఓట్లు దండుకుని బాబు, పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. ఎన్నికల హామీలో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు పెట్టి అన్ని ఇచ్చామని సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటున్నారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, నేటికి ఇవ్వలేదని గుర్తు చేశారు. 18 సంవత్సరాల దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని ఇవ్వాలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా కొత్త పింఛన్లు ఒకరికీ ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు చెప్పిన దాని కంటే ఎక్కువే చేశారని వివరించారు.

బీమా ఇచ్చి ఆదుకున్న వైఎస్ జగన్..

ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ ఒక వ్యక్తి ప్రమాదశావత్తు మరణిస్తే బీమా ఇంత వరకు ఇవ్వకపోవటం అన్యాయమన్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో బీమా ఇచ్చి పేద కుటుంబాలను ఆదుకున్నామని చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రజలను మాయ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఒంగోలు పార్టీ నగరాధ్యక్షుడు కఠారి శంకర్, సైకం రాంబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తాతా నాంచార్లు, వెంకటనారాయణ, గాలి ముసలారెడ్డి, సామంతుల వీరారెడ్డి, వాయల రోశయ్య, రవీంద్ర, కిషోర్, కృష్ణ, కోడూరి యానాది, కోడూరి జాలయ్య, వాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకు వద్ద స్వచ్ఛతా హీ సేవ



ఎస్‌ఎస్ ట్యాంకు వద్ద పిచ్చి మొక్కలు పీకేస్తున్న మేయర్, కమిషనర్



కొత్తపట్నం హైస్కూల్‌లో ఆవరణను శుభ్రం చేస్తున్న కెనరా బ్యాంక్ మేనేజర్ విక్రమ్

ఒంగోలు సబర్బన్: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఏక్ దిన్ ఏక్ గంటా–ఏక్ సాథ్ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ -1 దగ్గర గల జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం చేపట్టిన ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, ఎన్‌జీఓ సంస్థలు, బ్యాంకు ఉద్యోగులు, ప్రజల భాగస్వామ్యంతో జంగల్ క్లియరెన్స్ చేశామన్నారు.

కొత్తపట్నం: గ్రామాలు, పాఠశాలలు పరిశుభ్రంగా ఉండటమే కెనరా బ్యాంక్ లక్ష్యమని కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ జి.విక్రమ్ అన్నారు. గురువారం మండల కేంద్రం కొత్తపట్నంలో బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ పాఠశాలలో ఏక్ దిన్ ఏక్ గంటా–ఏక్ సాథ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ అనిల్, ఫీల్డ్ ఆఫీసర్ జెస్లీ జాన్, అసిస్టెంట్ మేనేజర్ జి.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

దీన్ దయాళ్ ఆశయాలు స్ఫూర్తిదాయకం



దీనదయాళ్ జయంతి సభలో నివాళులర్పిస్తున్న కళ్యాణ్‌చక్రవర్తి, నాయకులు



స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేస్తున్న జిల్లా యువజన అధికారి మహేందర్ రెడ్డి

- దీన దయాళ్‌కు ఘన నివాళులు

ఒంగోలు సిటీ: పండిట్ దీన దయాళ్ అనేకమందికి ఆదర్శం అని.. ఆయన జీవితం మొత్తం ప్రజాసేవకే అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గురువారం భారతీయ జనతాపార్టీ సిద్ధాంత కర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఒంగోలులోని వికసిత్ భారత్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. ఉత్తర్‌ప్రదేశ్‌లో అతిసామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన సంఘ్, బీజేపీ కోసం ఎంతో చేశారని గుర్తు చేసుకున్నారు. చిన్న వయసు నుంచే సమాజం, స్వదేశి, స్వధర్మం, దేశ సంస్కృతి లాంటి వాటికి ఆకర్షితులై, వాటిపై అధ్యయనాలు చేసి దేశం కోసం పాటుపడిన వ్యక్తి దీన దయాళ్ అని కల్యాణ్ చక్రవర్తి అన్నారు. అనంతరం దీన దయాళ్ చిత్రపటానికి ఘననివాళులర్పించారు. జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, జిల్లా మాజీ కార్యదర్శి శివాజీ యాదవ్, జిల్లా కార్యదర్శి విజయరావు, దుంప కోటిరెడ్డి, సత్యనారాయణ, శ్రీ లక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు సబర్బన్: పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయనకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యానం చిన యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా కిషోర్, బీజేపీ నాయకులు గోపీ శ్రీనివాస్ సత్యవతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ.

మేరా యువ భారత్ ఆధ్వర్యంలో వేదిక ఫౌండేషన్ గురువారం స్వచ్ఛంద సంస్థలకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. స్థానిక దేవుడు చెరువులోని వేదిక ఫౌండేషన్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన విభాగం అధికారి ఆకుల మహేందర్ రెడ్డి స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. తొలుత పండిట్ దీన్ దయాళ్ జయంతి వేడుకలు నిర్వహించారు.

ప్రజారోగ్యంలో ఫార్మాసిస్ట్ పాత్ర కీలకం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ప్రజారోగ్యంలో ఫార్మాసిస్ట్ పాత్ర ఎంతో కీలకమని ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు చెప్పారు. గురువారం ఏపీ ఎన్జీఓ హాలులో ప్రకాశం జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రకాశం భవనం నుంచి ఏపీఎన్జీఓ హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో శరత్ బాబు ప్రసంగిస్తూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మాసిస్ట్ పాత్ర ఎంతో కీలకమన్నారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్, నగర అధ్యక్షుడు కొత్తపల్లి మంజీష్, నాయకులు జె.రవి కిరణ్, రత్నాకర్ బాబు, పి.సూర్య ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ల వారీగా మీ కోసం

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని రెవెన్యూ డివిజన్‌ల వారీగా ఆయా కేంద్రాల్లో క్యాలెండర్ ప్రకారం మీ కోసం కార్యక్రమాలు నిర్వహించే విధంగా జిల్లా కలెక్టర్ పీ.రాజాబాబు ఆదేశించారని డీఆర్‌ఓ సీహెచ్ ఓబులేసు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా విస్తీర్ణంలో చాలా పెద్ద జిల్లా కావడం కనిగిరి, మార్కాపురం డివిజన్లలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దూరంలో ఉన్న ఒంగోలుకు రావడం చాలా వ్యయ ప్రయాసలకు కారణమవుతుంది. అందుకనే ప్రజల సౌకర్యార్థం కోసం జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు ఇక నుంచి డివిజన్ కార్యాలయాలకే వచ్చి అర్జీలు స్వీకరిస్తారు. ఈ విషయాన్ని గమనించి కనిగిరి, మార్కాపురం డివిజన్లకు చెందిన ప్రజలు షెడ్యూల్ ప్రకారం సమస్యలకు సంబంధించిన అర్జీలను కలెక్టర్‌కు, జిల్లా అధికారులకు సమర్పించుకోవచ్చన్నారు. ఒంగోలు డివిజన్‌కు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార మీటింగ్ హాలులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 29న కనిగిరి డివిజన్, అక్టోబర్ 6 మార్కాపురం డివిజన్, అక్టోబర్ 13న ఒంగోలు డివిజన్, అక్టోబర్ 27న కనిగిరి డివిజన్, నవంబర్ 3 మార్కాపురం డివిజన్, నవంబర్ 10న ఒంగోలు డివిజన్, నవంబర్ 17న కనిగిరి డివిజన్, నవంబర్ 24న మార్కాపురం డిజిన్‌లలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

ఏడాది దాటుతున్నా ఊసులేని రుణాలు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలను తక్షణమే విడుదల చేయాలని ఎంఎస్‌పీఎస్ అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు అందించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలు, ఎన్ఎస్ఎఫ్ డీసీ, రుణాలు, ఎన్ఎస్‌కేఎఫ్ డీసీ రుణాలను అందించడంలో, కూటమి ప్రభుత్వం జాప్యం చేయటం వలన, షెడ్యూల్ కులాలకు చెందిన నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతీ ,యువకులు బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాల కోసం ఒక సంవత్సరం కాలంగా ఆశగా ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రుణాల అందించడంలో ఎస్సీలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వెంటనే లింకేజీ రుణాలు విడదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దె త్యాగరాజు, డీ అప్పారావు, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్ మరమ్మతులకు నిధుల మంజూరు



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: మండలంలోని ముప్వావారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మరమ్మతులకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు రూ.3 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆ గ్రామ సర్పంచ్ బొడ్డు రవి పాఠశాల సమస్యను ఎంపీపీకి తెలిపారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఎంపీపీ.. వర్షానికి పాఠశాల పైకప్పు కారుతుండటంతో విద్యార్థుల ఇబ్బందులు పరిష్కరించడానికి మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో బొడ్డు కోటేశ్వరరావు, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో ఫార్మసిస్ట్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్ట్ డే గురువారం ఘనంగా నిర్వహించారు. థింక్ హెల్త్, థింక్ ఫార్మాసిస్ట్ థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యం గురించి ఆలోచించినప్పుడు ఫార్మసిస్ట్ గుర్తురావాలనే ఉద్దేశంతో ఈ థీమ్‌ని రూపొందించారు. కార్యక్రామంలో భాగంగా ఫార్మసి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఫార్మాసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమనూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి అన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా విభాగం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్ బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ ధనామూర్తి పాల్గొన్నారు.

చామదుంపలో మెళుకువలు పాటించాలి

కొత్తపట్నం: ఇసుక నేలల్లో వేసే చామదుంప పంటల్లో మెళుకువలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని దర్శి ఉద్యాన పరిశోధన క్షేత్రం సీనియర్ శాస్త్ర వేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు అన్నారు. ఈతముక్కల గ్రామలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గురువారం చామ పంట సాగు చేయు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చామదుంపలో రకాల ఎంపిక, దిగుబడి పెంచుకుంటానికి ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎస్.తేజ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించుకోవాలి

మద్దిపాడు: మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి స్వర్ణలత రైతులకు సూచించారు. గురువారం మండలంలోని దొడ్డవరం, గార్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.